సాక్షి
మహబూబాబాద్

శనివారం । 13 । మే । 2023

బుట్ట బొమ్మా.. బుట్ట బొమ్మా



షాపింగ్ మాల్‌లో పూజా హెగ్డే



సౌత్‌ఇండియా షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న పూజాహెగ్డే, మాల్ డైరెక్టర్లు సురేష్‌సీర్ణ, అభినయ్, రాకేష్, కేశవ్

హనుమకొండలో సౌత్‌ఇండియా షాపింగ్‌మాల్

- జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన సినీ నటి పూజా హెగ్డే

హనుమకొండలో బుట్ట బొమ్మ సందడి చేసింది. అశోకా హోటల్ ఎదురుగా ప్రొద్దుటూరు కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ 30వ బ్రాంచిని శుక్రవారం ఆమె అట్టహాసంగా ప్రారంభించారు. తమ అభిమాన హీరోయిన్ వస్తుందని తెలిసిన అభిమానులు షాపింగ్‌మాల్ వద్దకు పెద్దఎత్తున తరలివచ్చారు. పూజాహెగ్డే వారికి అభివాదం చేస్తూ అల వైకుంఠపురం సినిమాలోని బుట్టబొమ్మా.. బుట్టబొమ్మా పాటకు స్టెప్పులేసి అభిమానులను అలరించారు.

- హన్మకొండ చౌరస్తా

- IIలో ▸

న్యూస్‌రీల్

నేడు ఓపెన్ ఇంటర్ పరీక్ష

మహబూబాబాద్ అర్బన్: ఈ నెల 2న రద్దయిన ఓపెన్ ఇంటర్ ఎకనామిక్స్ పేపర్ పరీక్ష ఈ నెల 13న(శనివారం) ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ రామారావు శుక్రవారం తెలిపారు. జిల్లాలోని నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, తొర్రూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 114 మంది విద్యార్థులు, మహబూబాబాద్ పట్టణంలోని టీఎస్ మోడల్ స్కూల్‌లో 103మంది, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ఏ- కేంద్రంలో 58 మంది, బీ-పరీక్ష కేంద్రంలో 44 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు.

ఎమ్మెల్యే వాహనం అడ్డగింత



బయ్యారం: మొక్కజొన్నల కొనుగోలుపై ఆంక్షలు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని శుక్రవారం బయ్యారంలో ఆత్మీయ సమ్మేళనానికి వచ్చిన ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ వాహనాన్ని రైతులు అడ్డుకున్నారు. రోజుల తరబడి కేంద్రంలో మొక్కజొన్నలను ఆరబోసుకొని వాతావరణ పరిస్థితుల వల్ల ఇబ్బందులు పడుతున్నామని రైతులు తమ ఆవేదనను వెలిబుచ్చారు. దీంతో ఎమ్మెల్యే ఆత్మీయ సమ్మేళనం అనంతరం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. నాణ్యత పేరుతో అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆమె ఈవిషయంపై వసాయాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రైతులకు ఇబ్బంది లేకుండా వెంటనే కొనుగోళ్లు జరపాలని సూచించారు.

కొత్తూరు(సీ)లో వైద్య శిబిరం



సాక్షి ఎఫెక్ట్..

కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ)గ్రామంలో శుక్రవారం కురవి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శుక్రవారం 'సాక్షి'లో 'జ్వరపీడితులు' అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో స్పందించిన వైద్యాధికారులు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. కురవి పీహెచ్‌సీ డాక్టర్ విరాజిత నేతృత్వంలో క్యాంపు ఏర్పాటు చేసి ఇంటింటికీ తిరిగి జ్వరపీడితులను గుర్తించారు. మలేరియా పీవీ, పీఎఫ్ పరీక్షలు, డెంగీ నిర్ధారణ పరీక్షలు, జ్వరపీడితుల నుంచి రక్తపూతలను సేకరించారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ సుధీర్‌రెడ్డి, సబ్ యూనిట్ అధికారి డాక్టర్ గోపిచంద్ సందర్శించారు. సర్పంచ్ యానాల గంగాధర్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఏఎన్‌ఎంలు జ్యోతి, శైలజ, హెచ్‌ఈఓ గౌసొద్దీన్, వైద్య సిబ్బంది శ్రీధర్, ఆశకార్యకర్త శైలజ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూసెంటర్: జిల్లాలో నిర్వహించనున్న సీఎం కప్ క్రీడలకు దరఖాస్తులు కోరుతున్నట్లు కలెక్టర్ శశాంక శుక్రవారం తెలిపారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు మండల స్థాయిలో నిర్వహించే సీఎం కప్ టోర్నీ కోసం అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో పురుషులు, మహిళల విభాగాల నుంచి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గొర్రెల పంపిణీపై అవగాహన

పెద్దవంగర: మండలంలోని గొల్ల, కురుమ కులస్తులకు రెండో విడత గొర్రెల పంపిణీపై పశువైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ అవగాహన కల్పించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు సమావేశంలో డాక్టర్ మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులు డీడీలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ఎంపిక చేసిన ప్రాంతంలోనే గొర్రెల పంపిణీ ఉంటుందని, దానికి లబ్ధిదారులు సన్నద్ధం కావాలని తెలిపారు. అనంతరం లబ్ధిదారుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, బీఆర్‌ఎస్ మండల సీనియర్ నాయకులు సుధీర్, పంచాయతీ కార్యదర్శి వెంకన్న, యాదవ సంఘం నాయకులు శ్రీనివాస్, కుమారస్వామి, లింగయ్య, రాజేష్, మహేష్, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి ఇద్దరి మృతి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రైల్వేస్టేషన్ పరిధి కురవి గేటు సమీపంలో పట్టాలపై శుక్రవారం రాత్రి ఇద్దరు మృతి చెందారు. ఓ మహిళ, పురుషుడి శరీర భాగాలు పట్టాలపై గుర్తుపట్టలేని విధంగా ఉన్నాయి. కాగా వారు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నారా.. లేక పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందారా అనే విషయం తెలియాల్సి ఉంది. డోర్నకల్ జీఆర్పీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేస్తున్నారు.

అనధికారిక ప్రకటనలతో జాగ్రత్త

- ఎస్పీ శరత్ చంద్ర పవార్

మహబూబాబాద్ రూరల్: సోషల్ మీడియా వేదిక ద్వారా 'మీకు లాటరీ వచ్చింది, జాబ్స్ ఇప్పిస్తాం, విలువైన వస్తువులని తక్కువ ధరకు అందిస్తామని' అనధికారిక ప్రకటనల పోస్టులు, మెసేజ్‌లు చేసే సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం జిల్లా ప్రజలకు పలు సూచనలు చేశారు. సైబర్ నేరగాళ్లు ప్రజలను నిత్యం మోసం చేయడానికి సోషల్ మీడియాలో రెడీగా ఉంటారని, వారి వలలో పడొద్దని సూచించారు. ఇలాంటి సైబర్ మోసగాళ్ల బారినుంచి మిమ్ముల్ని మీరు రక్షించుకోవాలంటే సోషల్ మీడియాలో వచ్చే అనధికార ప్రకటనలను నమ్మొద్దని సూచించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కితే 1930 కి ఫోన్ చేయడం లేదా సైబర్ క్రైం వెబ్ సైట్ లేదా సైబర్ క్రైం పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ పేర్కొన్నారు.



ఎస్పీ శరత్‌చంద్ర పవార్

గణితంలో గల్లంతు

- పదో తరగతి మ్యాథ్స్ సబ్జెక్ట్‌లో ఎక్కువ మంది ఫెయిల్
- తెలుగులో తప్పిన 153 మంది విద్యార్థులు
- కనీస సామర్థ్యాలు లేకపోవడమే కారణం



సాక్షి, మహబూబాబాద్: ఇటీవల వెలువడిన పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో ఎక్కువ మంది విద్యార్థులు గణితం సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయ్యారు. జిల్లాలో విద్యా సంవత్సరం ముందు నుంచి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. ఈసారి కూడా లెక్క తప్పింది. అయితే ఇందుకు ప్రధాన కారణం ప్రాథమిక స్థాయి నుంచే గణితంలోని చతుర్విధ ప్రక్రియలు రాకపోవడమని తెలిసింది. అదేవిధంగా బోధనలో ఎన్నో మార్పులు వచ్చినా.. విద్యార్థుల్లో గణితంపై ఉన్న భయం పోగొట్టడంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు విఫలమయ్యారని ఉపాధ్యాయ, విద్యాశాఖ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా గతానికి భిన్నంగా ఈ సారి సైన్స్ తర్వాత తెలుగులో ఎక్కువ మంది ఫెయిల్ కావడం గమనార్హం.

755 మంది గణితంలో ఫెయిల్..

ఈ ఏడాది పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 755 మంది గణితంలో ఫెయిల్ అయ్యారు. 4,246 మంది బాలురు, 4,203 మంది బాలికలు మొత్తం 8,449 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 3,582 మంది బాలురు, 3,645 మంది బాలికలు మొత్తం 7,227 మంది ఉత్తీర్ణులు కాగా.. 1,222 మంది ఫెయిల్ అయ్యారు. ఇందులో అత్యధికంగా 755 మంది గణితంలో ఫెయిల్ అయ్యారు. కాగా గణితంలో చతుర్విధ ప్రక్రియలు కూడికలు, తీసివేతలు, గుణకార, భాగాహారాలు రాకపోవడమే అత్యధిక మంది ఫెయిల్‌కు కారణమని తెలుస్తోంది.

మాతృభాషపై తప్పుతున్న పట్టు

గతంలో ఏ సబ్జెక్టులో ఫెయిల్ అయినా.. మాతృభాష తెలుగులో మాత్రం పాస్ అయ్యేవారు. కానీ ఇప్పుడు మాతృ భాషలో పాస్ కావడం విద్యార్థులకు సవాల్‌గా మారింది. మారిన పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో చదువుతున్నారు. దీంతో ఎక్కవగా ఇంగ్లిష్ భాషపై పట్టు సాధిస్తున్నారు. కాగా ఈసారి ఇంగ్లిష్‌లో 92 మంది, సోషల్‌లో 86 మంది, హిందీలో 16 మంది ఫెయిల్ అయితే తెలుగులో మాత్రం 153 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. అంటే మాతృభాషలో చదవడం, రాయడం, అర్థం చేసుకోవడంలో ఇతర భాషలతో పోలిస్తే విద్యార్థులు వెనకబడి ఉన్నట్లు స్పష్టమవుతోంది.

తెలుగుపై ఆసక్తి తగ్గుతోంది



మారిన పరిస్థితులతో పాటు ఇంగ్లిష్ మీడియంలో చేరే విద్యార్థులు పెరిగారు. అయితే మాతృభాషపై ఆసక్తి లేకపోవడం, తెలుగే కదా అని సులభంగా తీసివేయడంతో కొందరు విద్యార్థులు కనీసం పాస్ మార్కులు కూడా సాధించలేకపోయారు. తెలుగు భాషపై విద్యార్థులకు ఆసక్తి పెంచేలా కృషి చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

-తాళ్లపల్లి యాకమ్మ, తెలుగు పండిట్

తప్పులను సరిదిద్దుకోవాలి..



గతంలో పోలిస్తే ఈ ఏడాది జిల్లాలో గణితంలో ఫెయిల్ అయిన విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఇందుకు కారణం మారిన పేపర్ విధానం. కోవిడ్‌లో రెండు విద్యా సంవత్సరాలు విద్యార్థులు నష్టపోయారు. దీంతో విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు కొరవడ్డాయి. వీటిని సరిదిద్దితే వచ్చే ఏడాది మంచి ఫలితాలు సాధించవచ్చు.

- కనకయ్య, స్కూల్ అసిస్టెంట్

మారిన పేపర్ విధానంతో ఇబ్బంది



ఈ ఏడాది పేపర్ విధానం మారింది. దీంతో గణితం తోపాటు, సైన్స్‌లో కూడా ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు ఎక్కువ సమయం పడుతుంది. ఇంగ్లిష్ మీడియం కావడంతో తెలుగులో కూడా విద్యార్థులు ఫెయిల్ అయ్యారు.

-సంక బద్రినారాయణ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

వైద్యరంగంలో నర్సులు కీలకం



మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

నెహ్రూసెంటర్: వైద్యరంగంలో రోగులకు సేవలందించడంలో నర్సుల పాత్ర కీలకమని, శాంతి, ప్రేమకు చిహ్నాలుగా నర్సుల సేవలు గుర్తుండిపోతాయని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నిర్వహించారు. ఫ్లోరెన్స్ నైటింగెల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. వైద్యులు వైద్యం అందిస్తే, నర్సులు వైద్యంతో పాటు సేవలు అందిస్తారని తెలిపారు. కోవిడ్ 19 సమయంలో నర్సులు అందించిన సేవలు గొప్పవని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలో కేవలం రెండు నర్సింగ్ కళాశాలలు మాత్రమే ఉండేవని, తెలంగాణ ఆవిర్భావం అనంతరం 33 నర్సింగ్ కళాశాలలు మంజూరు చేసుకోగా, 19 కళాశాలలు ప్రారంభమై బోధన జరుగుతుందన్నారు. నర్సింగ్ కోర్సు విద్యార్థులకు రూ. 5వేల స్కాలర్‌షిప్ పెంచడం జరిగిందని, వైద్యులకు కూడా గౌరవ వేతనం ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. జిల్లాలోని నర్సింగ్ కళాశాలలో 58 మంది విద్యార్థులు నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్నారని, వారందరూ ఉత్తమ విద్యార్థులుగా నిలవాలన్నారు. వేరే దేశాలకు ఉద్యోగాల కోసం వెళ్లనవసరం లేదని, రాష్ట్రంలోనే ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.లీలా, వైస్ ప్రిన్సిపాల్ జోత్స్న, ఆర్సీఓ రాజ్యలక్ష్మి, నర్సింగ్ కళాశాల అడ్మిన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

- కలెక్టర్ శశాంక



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నెహ్రూసెంటర్: రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, తేమ శాతాన్ని పరిశీలించి కొనుగోలు చేస్తామని కలెక్టర్ శశాంక తెలిపారు. జిల్లా కేంద్రంలోని బయ్యారం రోడ్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యాన్ని ఆరబెట్టుకుని తీసుకురావాలని రైతులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదేరోజు మిల్లులకు తరలించాలని కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. అదేవిధంగా రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి ఖుర్షీద్, సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ కృష్ణవేణి, తహసీల్దార్ ఇమ్మానియేల్, ఏఓ తిరుపతిరెడ్డి, ఏఈఓ పూజిత తదితరులు పాల్గొన్నారు.

పరీక్షకు ఏర్పాట్లు చేయాలి..

జిల్లాలో జూన్ 11న నిర్వహించే గ్రూప్-1పరీక్షలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి గ్రూప్-1పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 5,592 మంది భ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, మహబూబాబాద్, తొర్రూరు, మరిపెడలో 18సెంటర్లు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి పరీక్ష గదిలో డ్యూయల్ డెస్క్ బెంచీలు ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ఆర్డీఓలు కొమురయ్య, రమేష్, కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొంటాం

- వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి



కొనుగోలు కేంద్రంలో సమస్యలపై ఆరా తీస్తున్న మంత్రులు నిరంజన్‌రెడ్డి, దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అమ్మాపురం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి పరిశీలించారు. ధాన్యాన్ని పరిశీలించి సమస్యలపై రైతులతో మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడారు. ధాన్యం సేకరణతో పాటు రైతులకు వేగంగా డబ్బులు చెల్లిస్తున్నామన్నారు. వర్షాలతో తడిసిన ధాన్యం కొనుగోలు చేసి ఉప్పుడు బియ్యం (బాయిల్డ్)గా మార్చడానికి జిల్లాలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అనంతరం అమ్మాపురంలో ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని మంత్రి సందర్శించారు. 10వేల మందికి శిక్షణ అందిస్తున్నామని, శిక్షణ అనంతరం వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో మహిళలకు ఉపాధి కల్పిస్తున్నట్లు మంత్రి దయాకర్‌రావు నిరంజన్‌రెడ్డికి వివరించారు. కాగా కంఠాయపాలెంలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పంటను మంత్రులు పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర వేర్ హౌజ్ కార్పొరేషన్ చైర్మన్ సాయిచందు, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

- ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

బయ్యారం: పార్టీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధం కావాలని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బయ్యారంలోని కోదండరామచంద్రస్వామి ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ అధ్యక్షతన నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి హాజరై మాట్లాడారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ సీఎం కేసీఆర్ పాలనలో అభివృద్ధిలో దూసుకెళ్తోందన్నారు. రాష్ట్రం దేశానికే అన్నం పెట్టేస్థాయికి చేరిందని కొనియాడారు. పక్క రాష్ట్రాల ప్రజలు తెలంగాణ వైపు చూస్తున్నారని, బీఆర్‌ఎస్ వస్తే తమ బాధలు పోతాయనే భావనలో ఉన్నారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు సీఎం కేసీఆర్ రూ.13వేల కోట్లతో సీతారామ ప్రాజెక్టును మొదలుపెట్టారన్నారు. మరో రూ.3వేల కోట్లతో ఇల్లెందు నియోజకవర్గ పరిధిలోని 1.10లక్షల ఎకరాల భూములకు సాగునీరందించేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో సీతారామ ప్రాజెక్టుతో బయ్యారం చెరువును లింక్ చేయడంతో పాటు కాల్వలను బాగు చేస్తామని చెప్పారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి పదవిలోకి తెచ్చేందుకు ఇల్లెందు ఎమ్మెల్యేకు మరో అవకాశం ఇవ్వాలన్నారు. పార్టీని రక్షిస్తే అవకాశాలు వస్తాయని, ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు.

భారీ మోటార్ సైకిల్ ర్యాలీ..

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా మండలంలోని కొత్తపేట నుంచి బయ్యారం వరకు బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ద్వారా మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే హరిప్రియ ఆత్మీయ సమ్మేళన సమావేశాని చేరుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గణేష్, ఎంపీపీ మౌనిక, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీటీసీలు శైలజ, భద్రయ్య, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు బాబాతో పాటు పలువురు సర్పంచులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రక్షాళన దిశగా టెమ్రిస్‌

● నూరు శాతం అడ్మిషన్, ఉత్తీర్ణతే లక్ష్యం

న్యూశాయంపేట : తెలంగాణ మైనార్టీస్‌ రెసిడెన్షియల్‌ ఎడ్యుకేషనల్‌ ఇనిస్టిట్యూషన్స్‌ సొసైటీ (టెమ్రిస్‌) ప్రక్షాళన దిశగా అడుగులు పడుతున్నాయి. నూరు శాతం అడ్మిషన్, ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉన్నతాధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. 2023–24 విద్యాసంవత్సరానికి ముందే స్కూళ్లు, కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించే అంశంపై దృష్టి సారించారు. ఇదిలా ఉండగా ఫోర్‌ పాయింట్‌ రేటింగ్‌ స్కేల్‌ ద్వారా ఉద్యోగుల పనితీరు అంచనా వేయాలని టెమ్రిస్‌ సెక్రెటరీ షఫియుల్లా ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయమై అధికారులతో సెక్రెటరీ సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. సమన్వయం లేకుండా పని చేస్తున్న అధికారుల ఆట కట్టించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

అన్నీ ఉన్నా.....

ఉమ్మడి వరంగల్‌ జిల్లావ్యాప్తంగా పేద మైనార్టీ విద్యార్థుల కోసం కార్పొరేట్‌ స్థాయి వసతులతో 16 గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. రెగ్యులర్‌ ప్రిన్సిపాళ్లు, అధ్యాపకుల నియామకం జరిగింది. ఉమ్మడి జిల్లాల వారీగా గురుకులాలను సమన్వయం చేసేందుకు, మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి, రీజినల్‌ లెవల్‌ కన్సల్‌టెంట్‌ (ఆర్‌ఎల్‌సీ), విజిలెన్స్‌ అధికారులు (సేఫ్టీ సెక్యూరిటీ అధికారి, అకాడమిక్‌ మానిటరింగ్‌) అకాడమిక్‌ కోఆర్డినేటర్లను ప్రభుత్వం నియమించింది. అన్నీ ఉన్నా కొందరు ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపం, ఆధిపత్య పోరుతో వ్యవస్థ కుంటుపడే దుస్థితి నెలకొంది.

ఏటా..

తెలంగాణ మైనార్టీ గురుకులాలు 2016లో ప్రారంభం అయ్యాయి. ఉమ్మడి వరంగల్‌ జిల్లావ్యాప్తంగా తొలి రెండేళ్లు మెరుగైన ఫలితాలు సాధించినా తదనంతరం కొందరు అధికారుల ఆధిపత్య పోరుతో ఏటా, ఆర్నెళ్లకోసారి సమన్వయ అధికారులను, విజిలెన్స్‌ టీంను, ప్రిన్సిపాళ్లను ఉన్నధికారులు మారుస్తున్నారు. ఈ పరిస్థితితో గురుకులాలు నీరుగారే ప్రమాదం నెలకొంది. ఉన్నతాధికారులు సీనియార్టీకి తిలోదకాలిచ్చి జూనియర్లకు బాధ్యతలు అప్పగిస్తుండడంతో సమన్వయ లోపం నెలకొంటోంది.

ఉద్యోగుల పని విషయంలో రేటింగ్‌....

ఫోర్‌ పాయింట్‌ రేటింగ్స్‌ స్కేల్‌ ద్వారా గురుకులాల్లో పని చేస్తున్న ఉద్యోగులందరి పని తీరుకు రేటింగ్‌ ఇస్తున్నారు. పని తీరులో లోపాలుంటే చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులు ప్రక్షాళన చర్యలు చేపట్టారు. ఏ విషయంలో తేడా వచ్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎంత చెప్పినా.. మారని తీరు..

ఉన్నతాధికారులు, ఉద్యోగుల పని విషయంలో సంస్థ కార్యదర్శి షఫియుల్లా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలుమార్లు సమీక్షా సమావేశం నిర్వహించి 'మనసు పెట్టి పని చేయాలని' పలుమార్లు సూచించినా అధికారులు, ఉద్యోగుల్లో మార్పు రాకపోగా విభేదాలు హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి చేరాయి. ఇకనైనా పని తీరు మార్చుకోకపోతే వేటు తప్పదని సెక్రెటరీ హెచ్చరించినట్టు సమాచారం.

విజిలెన్స్‌ వ్యవస్థను మార్చాలి



గురుకులాల్లో ప్రస్తుతం ఉన్న విజిలెన్స్‌ వ్యవస్థను మార్చాలి. రెండు, మూడు ఉమ్మడి జిల్లాలకు ఒక టీం ఏర్పాటు చేస్తే మేలు. సంస్థకు నిధులు ఆదా అవుతాయి. అనుభవజ్ఞులనే విజిలెన్స్‌ అధికారులుగా నియమించాలి. గురుకులాల పటిష్టత కోసం కమ్యూనిటీ మొబిలైజేషన్‌ అధికారులను ఏర్పాటు చేయాలి.

– డాక్టర్‌ రాజ్‌మహ్మద్‌ (ఎంఆర్‌పీఎఫ్‌ అధ్యక్షుడు)

సీనియర్‌ అధికారికే ఆర్‌ఎల్‌సీ ఇవ్వాలి



గురుకులాలను సమన్వయం చేసేలా ఉమ్మడి జిల్లాస్థాయిలో పనిచేసిన సీనియర్‌ అధికారికే ఆర్‌ఎల్‌సీ పోస్టు అప్పగించాలి. ప్రస్తుత పరిస్థితితో ఉద్యోగుల్లో అసంతృప్తి నెలకొంది. పని తక్కువ పరేషాని ఎక్కువ అన్న భావన నెలకొంది.

– మహ్మద్‌ తాజొద్దీన్‌ (టీఎంపీఎస్‌ రాష్ట్ర కార్యదర్శి)



భద్రకాళి ఆలయంలో న్యాయమూర్తి పూజలు

హన్మకొండ కల్చరల్‌ : వరంగల్‌లోని శ్రీ భద్రకాళి ఆలయంలో తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ట్రిబ్యునల్‌ న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పూజలు నిర్వహించారు. తొలుత ఆయన కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శించగా ఈఓ శేషుభారతి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆది శంకరులను, వల్లభ గణపతిని న్యాయమూర్తి దర్శించి పూజలు చేశారు. అనంతరం ఆలయ స్వపన మందిరంలో వేద పండితులు మహాదాశీర్వచనం అందజేశారు. తదనంతరం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని ఈఓ రమాదేవి భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్‌ కమిషనర్‌ రామల సునీత, పరిశీలకుడు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భద్రకాళి ఆలయంలో న్యాయమూర్తి

ట్రేడింగ్‌ బిజినెస్‌ పేరిట మోసం

రామన్నపేట : ట్రేడింగ్‌ బిజినెస్‌ పేరిట ఓ మహిళ రూ.6 లక్షలు మోసపోయినట్లు మట్టెవాడ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. టెలిగ్రామ్‌ యాప్‌లో షాపింగ్‌ ట్రేడింగ్‌ బిజినెస్‌ పేరిట ఓ మహిళ మొబైల్‌ ఫోన్‌కు గతేడాది డిసెంబర్‌ 1న లింక్‌ వచ్చింది. బాధిత మహిళ లింక్‌ ఓపెన్‌ చేసి రూ.100 పెట్టుబడి పెట్టగా రూ.200 రిఫండ్‌ చేశారు. దీంతో ఆమె మోసగాళ్ల మాటలను నమ్మి సుమారు రూ.6 లక్షల వరకు పంపించింది. కాగా ఆమెకు డబ్బులు తిరిగి రాలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన సదరు మహిళ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్‌ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

భూక్యాతండా టు నేపాల్‌..

● ఎవరెస్ట్‌ పర్వతారోహణకు బయల్దేరిన యశ్వంత్‌ నాయక్‌

మరిపెడ రూరల్‌ : మహబూబాబాద్‌ జిల్లాలోని మరిపెడ మండలంలోని భూక్యాతండాకు చెందిన మౌంటెయినర్‌ భూక్యా యశ్వంత్‌ నాయక్‌ ప్రయాణం ఆ తండా నుంచి నేపాల్‌కు సాగుతోంది. ఆయన ఇప్పటికే పలు ప్రపంచ పర్వతాలను అధిరోహించి అరుదైన రికార్డులు నెలకొల్పారు. ఇటీవల ప్రపంచంలోనే అతి ఎత్తైన ఎవరెస్ట్‌ పర్వతారోహణకు ఎంపికయ్యాడు. ఈ క్రమంలో గురువారం హైదరాబాద్‌ నుంచి ఢిల్లీకి వెళ్లాడు. నేడు (శనివారం) ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి నేపాల్‌కు వెళ్లనున్నాడు. నేపాల్‌లో ముందుగా బేస్‌ క్యాంప్‌ నిర్వహించిన అనంతరం ఆగస్టులో 8,848.86 మీటర్ల ఎత్తులో ఉన్న ఎవరెస్ట్‌ శిఖరాన్ని యశ్వంత్‌ అధిరోహించనున్నాడు. ఎస్‌ఆర్‌ సాఫ్ట్‌వేర్‌ సొలిషియా ప్రైవేట్‌ లిమిటెడ్‌ సంస్థ తనకు స్పాన్సర్‌షిప్‌ ఇచ్చి ఎవరెస్ట్‌ పర్వతారోహనకు ఎంపిక చేసినట్టు యశ్వంత్‌ తెలిపారు.



ఢిల్లీ విమానాశ్రయంలో యశ్వంత్‌ నాయక్‌

గుండెపోటుతో అటవీ శాఖ సెక్షన్‌ అధికారి మృతి

మంగపేట : స్థానిక అటవీ శాఖ రేంజ్‌ పరిధిలోని నర్సింహసాగర్‌ సెక్షన్‌ ఆఫీసర్‌ బద్ది సంపత్‌ (53) గుండెపోటుకు గురై శుక్రవారం మృతి చెందాడు. ఆ శాఖ అధికారుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని నల్లగుంట గ్రామానికి చెందిన సంపత్‌ 1990లో పస్రా అటవీ శాఖ రేంజ్‌ పరిధిలోని బయ్యక్కపేట సెక్షన్‌లో అసిస్టెంట్‌ బీట్‌ ఆఫీసర్‌గా విధుల్లో చేరాడు. అనంతరం పలు ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. ఐదేళ్లుగా నర్సింహసాగర్‌ సెక్షన్‌ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మండల కేంద్రంలోని కోమటిపల్లి క్రాస్‌ వద్ద ఓ గది అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నాడు. కాగా శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై మృతి చెందాడు. వాకింగ్‌కు వెళ్తున్న వ్యక్తులు గమనించి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా ఆయన్ను వెంటనే ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సంపత్‌ కుటుంబ సభ్యులు ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని స్వగ్రామమైన నల్లగుంటకు తరలించారు. మృతుడికి భార్య రమాదేవి, ఇద్దరు పిల్లలున్నారు.



సంపత్‌ (ఫైల్‌)

రోడ్డు ప్రమాదంలో వైద్యుడి మృతి

● ముగ్గురికి తీవ్ర గాయాలు

టేకుమట్ల (రేగొండ) : లారీని ఓవర్‌టేక్‌ చేస్తూ ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టగా ఓ వైద్యుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా పరిధిలోని రేగొండ మండలంలోని చెన్నాపూర్‌ శివారులో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండకు చెందిన సిగ్మా హాస్పిటల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఎడవెల్లి రాజు(40) బంధువులతో కలిసి కారులో భూపాలపల్లిలో ఓ శుభ కార్యానికి హాజరై తిరిగి వెళ్తున్న క్రమంలో రేగొండ మండలంలోని చెన్నాపూర్‌ శివారులో ముందుగా వెళ్తున్న లారీని కారు డ్రైవర్‌ ఓవర్‌టేక్‌ చేయబోయి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు సీటులో కూర్చున్న సిగ్మా హాస్పిటల్‌ డైరెక్టర్‌ రాజు అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవర్‌ గౌరీ శంకర్‌తోపాటు కారులో ప్రయాణిస్తున్న కుమారస్వామి, దాడి సత్యం తీవ్ర గాయాల పాలయ్యాయి. రేగొండ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. క్షతగాత్రులను వైద్యం కోసం హనుమకొండలోని ఆస్పత్రికి తరలించారు.



మృతి చెందిన డాక్టర్‌ రాజు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి ..

స్టేషన్‌ఘన్‌పూర్‌: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌ మండలం మీదికొండ క్రాస్‌రోడ్డు సమీప జాతీయ రహదారిపై గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఘన్‌పూర్‌కు చెందిన కామశ్ల రాజయ్య(70) మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. అటవీశాఖ వారు జాతీయ రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలకు నీరు పోసేందుకు రాజయ్య కూలీగా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం నీరు పోసేందుకు వెళ్లిన ఆయన రాత్రయినా ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్‌ చేసినా స్పందన లేకపోవడంతో శుక్రవారం ఉదయం పోలీసులను ఆశ్రయించారు. ఫోన్‌ సిగ్నల్‌ ఆధారంగా పోలీసులు ట్రేస్‌ చేయగా మీదికొండ క్రాస్‌రోడ్డు సమీప జాతీయ రహదారి పక్కన చెట్ల పొదల్లో రాజయ్య మృత దేహాన్ని గుర్తించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొన్నట్లు పోలీసులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు రాజశేఖర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



కామశ్ల రాజయ్య మృతదేహం

సీబీఎస్‌ఈ ఫలితాల్లో 'ఎస్సార్‌' విజయభేరి



బానోతు సంజయ్‌ గండనేని సాత్విక్‌ సాయి హర్షిణి వల్లాల హర్షిణి రావుల అక్షయ

హన్మకొండ : సీబీఎస్‌ఈ టెన్త్‌ ఫలితాల్లో ఎస్‌ఆర్‌ విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారు. అత్యుత్తమ మార్కులతో తమ స్కూల్‌ విద్యార్థులు రాణించారని ఆ విద్యాసంస్థల చైర్మన్‌ ఎ.వరదారెడ్డి తెలిపారు. సీబీఎస్‌ఈ టెన్త్‌లో రావుల అక్షయ జాతీయ స్థాయిలో 488, వల్లాల హర్షిణి 487, గోలి సాయి హర్షిణి 485, బానోతు సంజయ్‌ 484 మార్కులు సాధించారని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. క్రమశిక్షణతో కూడిన విద్య, పటిష్టమైన పాఠ్య ప్రణాళిక, అంకితభావం కలిగిన ఉపాధ్యాయ బృందంతో అత్యుత్తమ విద్యాబోధన అందించడం ద్వారా సత్ఫలితాలు సాధించామని పేర్కొన్నారు. విద్యార్థులను అన్ని పోటీ పరీక్షలకు సిద్ధం చేయడానికి బృహత్తరమైన ప్రణాళికతో ప్రైం స్కూల్స్‌ను రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించామని తెలిపారు. ఈ ఏడాది ఐపీఈలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించామని, జేఈఈలో జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు వచ్చాయని వివరించారు.

12వ తరగతి ఫలితాల్లో ..


సీబీఎస్‌ఈ 12వ తరగతి పరీక్షల ఫలితాల్లో ఎస్‌ఆర్‌ విద్యాసంస్థల విద్యార్థులు విజయదుందుభి మోగించారని ఆయన చెప్పారు. సీబీఎస్‌ఈ 12వ తరగతిలో బుర్ర సహర్ష జాతీయ స్థాయిలో 480, కలకుంట్ల రిషిక 470, గండపనేని సాత్విక్‌ 469, పింజాల నర్మద 466, కందుకూరి శివతేజ 465, దుస్స శ్రీవర్ష, ఐలూరి సమరత్నరెడ్డి 464, సాతర్ల వెంకట నాగ భావన 462, పంచనేని హర్షిత 461, కొత్త ఆశ్రితరెడ్డి 461, గుగులోతు వర్షిణి 460 మార్కులు సాధించారని వివరించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎస్‌ఆర్‌ విద్యాసంస్థల చైర్మన్‌ ఎ.వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి అభినందించారు.

డీపీఎస్‌ జయకేతనం..

● 10, 12 తరగతుల్లో మెరుగైన ఫలితాలు



లాహిర్‌ ప్రసాద్‌ (98శాతం)



ఎ.మంజునాథ్‌ (98శాతం) పీఎస్‌ ప్రణయ్‌ (97 శాతం) శ్రీ సౌమిత్‌ (97 శాతం)
కె.సాయిశివాజి (96శాతం) నాగసాయి అనురాగ్‌ (96 శాతం) రనీన్హ అహ్మద్‌ (96 శాతం)

ధర్మసాగర్‌ : సీబీఎస్‌ఈ టెన్త్, 12వ తరగతుల ఫలితాల్లో ఢిల్లీ పబ్లిక్‌ స్కూల్‌ (డీపీఎస్‌) విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఆ పాఠశాల ప్రెసిడెంట్‌ రాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో 10వ తరగతిలో ఎం.లాహిర్‌ ప్రసాద్, ఎ.మంజునాథ్‌ 98 శాతం, పీఎస్‌.ప్రణయ్, బి.శ్రీసౌమిత్‌ 97 శాతం, కె.సాయిశివాజి, ఎ.నాగసాయి అనురాగ్, రనీన్హ అహ్మద్, ఇల్హామ్‌ నౌరిజా 96 శాతం మార్కులు సాధించారని తెలిపారు. 12వ తరగతిలో పలువురు విద్యార్థులు 96 శాతం మార్కులు సాధించి జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచారని చెప్పారు. 10వ తరగతిలో 70 శాతం, 12వ తరగతిలో 60 శాతం మంది విద్యార్థులు డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ అలవర్చేందుకు, సాంస్కృతిక, క్రీడారంగాల్లో ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు పాఠశాల యాజయాన్యం కృషి చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో డీపీఎస్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ రాకేష్‌రెడ్డి, చైర్మన్‌ రవికిరణ్, ప్రిన్సిపాల్‌ పిళ్లై మంజుమోల్‌ శివశంకర్, వైస్‌ ప్రిన్సిపాల్‌ కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.

ఏకశిల విద్యాసంస్థల జోరు..



కె.సాయిదీక్షిత్‌ ఏ.హర్షిత్‌ ఫణికీర్తన్‌రెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్‌ తిరుపతిరెడ్డి

హసన్‌పర్తి : సీబీఎస్‌ఈ టెన్త్‌ ఫలితాల్లో ఏకశిల విద్యార్థుల హవా కొనసాగింది. ఆ పాఠశాలకు చెందిన కే.సాయి దీక్షిత్‌ 485, ఏ.హర్షిత్‌ 484, ఎం.ఫణి కీర్తన్‌రెడ్డి 483, కె.హారిక 481 మార్కులు సాధించారని ఆ విద్యాసంస్థల చైర్మన్‌ డాక్టర్‌ గౌరు తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అత్యుత్తమ బోధన, క్రమశిక్షణతో కూడిన విద్యావిధానమే విజయానికి కారణమన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బేతి కొండల్‌రెడ్డి, గౌరు సువిజారెడ్డి, ప్రిన్సిపాళ్లు బాబా, రవికిరణ్, రమేష్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, లక్ష్మణ్, భిక్షపతి, ఫణిమోహన్‌రావు, లవకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రీన్‌వుడ్‌ ప్రభంజనం..




మారం రియా ఎస్‌.సూర్య

హసన్‌పర్తి : సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గ్రీన్‌వుడ్‌ స్కూల్‌ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్‌ డాక్టర్‌ గిర్రెం భరద్వాజ్‌ నాయుడు తెలిపారు. మొత్తం 362 మంది విద్యార్థులు పరీక్ష రాయగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన చెప్పారు. పాఠశాలకు చెందిన మారం రియా 486, ఎస్‌.సూర్య 482 మార్కులు సాధించారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన ఆ విద్యార్థులను పాఠశాలలో డైరెక్టర్లు చల్లా ధర్మారెడ్డి, డాక్టర్‌ భరద్వాజ్‌ నాయుడు, సీఏఓ ప్రభుకుమార్, ప్రిన్సిపాళ్లు నవీన్‌కుమార్, పవన్‌కుమార్, మంజులాదేవి అభినందించారు.

శ్రీ చైతన్య విజయదుందుభి

హన్మకొండ : సీబీఎస్‌ఈ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో సత్తా చాటారని ఆ విద్యాసంస్థల చైర్మన్‌ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్‌ శ్రీవిద్య తెలిపారు. యశస్విని 487, షర్మిత 483, నిహాల్‌ 475, శ్రీజ 474, ప్రేమ్‌ సాయి 466, స్రవంతి 460 మార్కులు సాధించారని వివరించారు. 95 శాతం విద్యార్థులు ఎ–1 గ్రేడ్‌ సాధించగా 22 మంది 450కిపైగా మార్కులు సాధించారని తెలిపారు. ఇంటిగ్రేటెడ్‌ కరిక్యులంతో విద్యార్థులను జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించామని చెప్పారు. విద్యార్థులు కేవలం తరగతి గదులకు పరిమితం కాకుండా వారికి అన్ని రంగాల్లో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్‌ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్‌ శ్రీవిద్య, డీజీఎం చేతన్, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు.

'తేజస్వి' హవా..



ధన షణ్ముక చాడ అక్షిత్‌ ఐత ఆర్యన్‌ కందికొండ కీర్తి

నయీంనగర్‌: సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తేజస్వి విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని స్కూల్‌ యజమాన్యం తెలిపింది. మొత్తం 204 మంది పరీక్ష రాయగా నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. 23 మంది 90 శాతానికిపైగా, 91 మంది 80 శాతానికిపైగా, 174 మంది 75 శాతానికిపైగా, 132 మంది 70 శాతానికిపైగా మార్కులు సాధించారని వివరించారు. భూక్య ధన షణ్ముక 482, చాడ అక్షిత్‌ 477, ఐతా ఆర్యన్‌ 474, కందికొండ కీర్తి 474 మార్కులు సాధించారని తెలిపారు.

సరికొత్త వస్త్ర ప్రపంచం సౌత్‌ ఇండియా షాపింగ్‌ మాల్‌

● హనుమకొండలో బ్రాంచ్‌ ప్రారంభం
● సినీ నటి పూజా హెగ్డే రాకతో సందడి

హన్మకొండ చౌరస్తా : సరికొత్త వస్త్ర ప్రపంచాన్ని తలపించేలా నిర్వాహకులు సౌత్‌ ఇండియా షాపింగ్‌ మాల్‌ ఏర్పాటు చేశారు. హనుమకొండలోని ప్రొద్దుటూరు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఆ మాల్‌ 30వ బ్రాంచ్‌ను ప్రముఖ సినీ నటి పూజా హెగ్డే ముఖ్యఅతిథిగా హాజరై శుక్రవారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆమె రాకతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా పూజా హెగ్డే మాట్లాడారు. అన్ని తరాల వారి అభిరుచులకు అనుగుణంగా అత్యాధునిక డిజైన్లలో వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇంత గొప్ప షాపింగ్‌ మాల్‌ ప్రారంభోత్సవానికి ఆహ్వానించారంటూ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అతిథులుగా వరంగల్‌ ఎంపీ పసునూరి దయాకర్, ప్రభుత్వ చీఫ్‌ విప్‌ దాస్యం వినయ్‌భాస్కర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మేయర్‌ గుండు సుధారాణి హాజరై మాట్లాడారు. దేశంలోని ప్రముఖ సౌత్‌ ఇండియా షాపింగ్‌ మాల్‌ను ఉమ్మడి వరంగల్‌ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి వరంగల్‌ జిల్లా ప్రజలు ఇక వివాహ, ఇతర శుభకార్యాల సందర్భంగా వస్త్రాలను కొనుగోలు కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. షాపింగ్‌ మాల్‌ డైరెక్టర్‌ సురేష్‌ సీర్ణ మాట్లాడుతు తెలుగు రాష్ట్రాల్లో సౌత్‌ ఇండియా షాపింగ్‌ మాల్‌ అగ్రస్థానంలో కొనసాగుతోందని చెప్పారు. విస్తరణలో భాగంగా దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాలు, నగరాల్లో సైతం అతి త్వరలో షోరూమ్స్‌ ప్రారంభించనున్నట్టు తెలిపారు. వైవిధ్య భరిత శ్రేణులకు చెందిన అగ్రశ్రేణి నాణ్యత కలిగిన టాప్‌ బ్రాండ్‌ వస్త్రాభరణాలు మాల్‌లో లభిస్తాయని వివరించారు. ప్రారంభ ఆఫర్‌గా కాస్ట్‌ టు కాస్ట్‌ సేల్‌ ప్రాతిపదికపై విక్రయిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మాల్‌ డైరెక్టర్లు అభినయ్, కేశవ్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.



అభిమానులకు అభివాదం చేస్తున్న పూజా హెగ్డే

సాక్షి క్లాసిఫైడ్స్‌

REAL ESTATE

HOUSE FOR SALE

■ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన, భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27024]

■ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నేమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27028]

■వరంగల్, రంగశాయిపేట, శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-27026]

FLAT FOR SALE

■KUDA కాలనీ, 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27022]

■ LAUNCHING OFFER: రూ. 3లక్షలకే 18 లక్షల విలువ గల 1050Sft. గల 2BHK Flat సొంతం చేసుకోండి. ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి Temple నుండి 28కి.మీ. మాత్రమే. ఫోన్: 9948525151, 6262838353 మార్కెటింగ్ కు ఏజెంట్లు కావలెను. [HA-3219]

SERVICES

■అతి సులభంగా రుణాలు పొందండి. వ్యాపారం ప్రాపర్టీ మార్క్ షీట్ వ్యక్తిగత LIC వ్యవసాయ భూమిపై తక్కువ దస్తావేదులతో పొందండి. 9505973750, 8096532189. [T-69]

పాస్‌పోర్ట్ పోయినది

■I, MOHAMMED ABDUL MUJEEB, S/o. MOHAMMED ABDUL HAFEEZ, R/o H.No.7-6-180, Machili Bazar, Hanamkonda, District, T.S,have lost my original passport bearing no L8713701 while I was traveling on my motor cycle from Machili Bazar to Hanamkonda Chowarastha,if any one found, please inform at the above address Contact No: 7893521792. [W-1170548]

WANTED

■ Kamalatmika Poultry is looking for the following positions in Warangal. 1) Accountant 2) Store Supervisor. Exp. is mandatory in the same domain. Attractive Salary & Bonus. 8106112401 [W-785552]

■ వరంగల్‌లోని కిరాణం షాప్ నందు పని చేయుటకు 3 సం॥ అనుభవం కల్గిన (స్త్రీ/పు) కావలెను. వరంగల్ లోకల్ వారు మాత్రమే సంప్రదించండి. యువరాజ్ కిరాణం, వరంగల్. 9490133696 [W-785555]

■ అనుభవం గల ఫోటోషాప్ డిజైనర్ & ఫ్లెక్స్ ప్రింటింగ్ ఆపరేటర్ జీతం : 15K-25K చిన్న ఫ్లెక్స్ ప్రింటింగ్, అశోక్‌నగర్, Hyd. 9848234571 [HA-93088]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం॥ 15000 + ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు సంప్ర: 8341371684. [G-786303]

■ లేపాక్షి హెల్త్‌కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్: 9640400073. [HA-148]

■ సెక్యూరిటీ గార్డ్స్, సెక్యూపర్‌వైజర్, కా॥ L.B. నగర్, ఘట్‌కేసర్, బాచుపల్లి, కొల్లూర్, జీడిమెట్ల, కాజగూడ & ఆఫీస్ బాయ్స్, హౌస్ కీపింగ్ కా॥ మంచి జీతం. మెట్రో మేనేజ్‌మెంట్. ఫోన్ : 9885657755, 9963077722. [H-781417]

WANTED TEACHERS

■ Wanted Qualified Teachers and PET's for Nursery to VII Class (All Subjects) Contact: Cell: 7416744459, 7416744469. [W-1002199]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సేవ చేసే అవకాశమిచ్చిన సీఎంకు కృతజ్ఞతలు

ప్రధాన సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన సోమేశ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుగా మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ శుక్రవారం బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని ఆరో అంతస్తులో తనకు కేటాయించిన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి రాష్ట్రానికి సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా సచివాలయంలోని అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

ఐటీ కొత్త నిబంధనలపై అవగాహన సదస్సు

సాక్షి, హైదరాబాద్: పన్ను మినహాయింపు నిబంధనల్లో వచ్చిన మార్పులను పన్ను చెల్లింపుదారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు గమనించాలని న్యూఢిల్లీ చీఫ్ కమిషనర్ (మినహాయింపులు) రేణు జౌహ్రీ సూచించారు. ఆదాయపు పన్ను మినహాయింపులో కొత్త, సవరించిన నిబంధనలను వివరించడానికి, హైదరాబాద్ ఏసీగార్డ్స్‌లోని ఆదాయపు పన్ను టవర్స్‌లో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రేణు జౌహ్రీ మాట్లాడుతూ.. ఆదాయపు పన్నులో మినహాయింపు సెక్షన్లలో తెచ్చిన కొత్త నిబంధనలు, సవరణలను తెలిపారు. నాన్ ప్రాఫిటబుల్ ఆర్గనైజేషన్స్ (ఎన్‌పీఓ)ల నమోదులో ఏప్రిల్ 1 నుంచి కొత్త విధానం ప్రారంభమైందని, ఇప్పటికే ఉన్న ఎన్‌పీఓలు, కొత్త ఎన్‌పీఓలు ఏదైనా మినహాయింపును క్లెయిమ్ చేయడానికి కొత్త రిజిస్ట్రేషన్ విధానాన్ని అనుసరించాలని సూచించారు. కొత్త నిబంధనల ప్రకారం, నిర్దిష్ట ఉల్లంఘనలకు పాల్పడితే రిజిస్ట్రేషన్ రద్దు చేయబడుతుందని స్పష్టం చేశారు. మినహాయింపును క్లెయిమ్ చేయడానికి, ఆదాయ రిటర్న్‌ను దాఖలు చేయడం తప్పనిసరని, అవసరమైన ఆడిట్ నివేదికలు, ఇతర నివేదికలను సమయానుకూలంగా సమర్పించాలని వెల్లడించారు. కార్యక్రమంలో జేసీఐటీ (మినహాయింపులు) వి.కోటేశ్వరమ్మ, డీసీఐటీ (మినహాయింపులు) సుధా కొరివి, డీసీఐటీ (మినహాయింపులు) ధృవాష్ట, ఆదాయపు పన్ను అధికారులు, పన్ను బార్ అసోసియేషన్ సభ్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.

అధ్యాపకుడు మధుసూదన్ రెడ్డిని తొలగించండి

ప్రభుత్వానికి ఇంటర్ బోర్డ్ కార్యదర్శి సిఫార్సు

సాక్షి, హైదరాబాద్: సస్పెండైన సరూర్‌నగర్ జూనియర్ కళాశాల అధ్యాపకుడు పి.మధుసూదన్ రెడ్డిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని ప్రభుత్వానికి ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ సిఫార్సు చేశారు. మధుసూదన్ రెడ్డిపై అవినీతితో పాటు, బాధ్యతారాహిత్యం, విధుల్లో క్రమశిక్షణ రాహిత్యం, ఉద్యోగులను బెదిరించడం, మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలున్నాయని పేర్కొన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆయనను విధుల నుంచి తొలగించడం సరైన నిర్ణయమని ప్రభుత్వ కార్యదర్శికి పంపిన ఫైల్‌లో నవీన్ మిత్తల్ పేర్కొన్నారు.

ఐసీఐడీ వేదికలో భాగస్వామి కండి

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ సాగులో నీటి ఎద్దడి నివారణ అనే థీమ్‌తో నవంబర్ 1 నుంచి 8వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న అంతర్జాతీయ ఇరిగేషన్, డ్రైనేజీ కమిషన్ (ఐసీఐడీ) అంతర్జాతీయ కాంగ్రెస్‌లో భాగస్వామి కావాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఐసీఐడీ ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం ఈఎన్‌సీ మురళీధర్‌ను కలిసి సమావేశం వివరాలను తెలిపారు. 57 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత భారతదేశానికి ఈ అవకాశం వచ్చిందని, విశాఖ వేదిక కానుందని పేర్కొన్నారు.

కొత్త ఫీజు నియంత్రణ చట్టం తీసుకురండి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు అధిక ఫీజుల వసూళ్లను అరికట్టేందుకు కొత్త ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని భారతీయ జనతా యువమోర్చా డిమాండ్ చేసింది. ఫీజు రెగ్యులేటరీ కమిటీలను బలోపేతం చేసి ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం రూపొందించిన నివేదికతో ప్రైవేట్ సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మదన్మోహన్‌కు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్ ఆధ్వర్యంలోని బృందం వినతి పత్రం సమర్పించింది.


కాలులేని భార్యను భుజంపై మోసుకొని..

వరంగల్ ఎంజీఎంలో స్ట్రెచర్‌లేక రోగి అవస్థ • చికిత్సకు వచ్చి వెళ్లే క్రమంలో ఘటన • సోషల్ మీడియాలో వీడియో వైరల్

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎంలో స్ట్రెచర్ అందుబాటులో లేక ఓ వృద్ధుడు తన భార్యను చికిత్స అనంతరం భుజాలపై మోసుకెళ్లిన ఘటన శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మాలోతు లక్ష్మికి నవంబర్‌లో కుడికాలి రక్తప్రసరణ ఆగిపోవడంతో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి మోకాలు కింద నుంచి కాలును తొలగించారు. రోగిని 15 రోజులకోసారి డ్రెస్సింగ్ కోసం తీసుకురావాలని సూచించారు. ఈ క్రమంలో శుక్రవారం లక్ష్మిని ఆమె భర్త ఆస్పత్రికి తీసుకుచ్చాడు. అక్కడున్న సిబ్బంది 'పెద్ద సార్ లేరు.. రేపు రావాలని చెప్పారు. అయితే ఆ సమయంలో స్ట్రెచర్ అందుబాటులో లేకపోవడంతో భుజాలపై మోసుకుంటూ మండుతున్న ఎండలోనే బయటకు తీసుకెళ్లాడు. ఈ ఘటనపై ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ స్పందించారు. డ్రెస్సింగ్ అనంతరం పేషెంట్ కేర్ సిబ్బంది రోగిని వీల్‌ఛైర్‌లో క్యాజువాలిటీ నుంచి బయటకు తీసుకొచ్చారని తెలిపారు. కాలిపర్ (కాలుకు అమర్చే లోహ పరికరం) సేవల కోసం వెళ్లగా శనివారం అందుబాటులో ఉంటుందని, అప్పుడు రావాలని సిబ్బంది చెప్పారన్నారు. దీంతో తిరిగి వెళ్లే క్రమంలో ఎండ తీవ్రత దృష్ట్యా భర్త తన భార్యను ఒక చెట్టు వద్దకు తీసుకెళ్లేందుకు భుజంపై ఎక్కించుకొని వెళ్తుండగా కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారన్నారు. ఇలాంటి ఘటనలతో ఆస్పత్రిని అభాసుపాలు చేయవద్దని కోరారు.

టుడేస్ గ్రాఫిక్

మీకో విషయం తెలుసా? ప్రతి నాలుగు నిమిషాలకు ఈ భూమ్మీద వెయ్యి మంది పుడతారట. అయితే, ఆ వెయ్యి మందిలో ఏ దేశంలో ఎంత మంది జన్మిస్తారు? అల్రెడీ జనాభాలో నంబర్ వన్‌గా ఉన్న మనం.. ఈ విషయంలోనూ మొదటి స్థానంలోనే ఉన్నాం. వచ్చే నాలుగు నిమిషాల్లో ఆ వెయ్యిమందిలో 172 మంది భారత్‌లోనే పుడతారట. మరి మిగతా దేశాల సంగతేంటో.. ఓసారి చూద్దామా..



అడవులు కేంద్రంగా ఉగ్రవాద శిక్షణ

సాక్షి, హైదరాబాద్: నగరంతో పాటు భోపాల్‌లో పట్టుబడిన 16 మంది ఉగ్రవాదులు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాల్లోనే శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారు. నగర శివార్లలో ఉన్న వికారాబాద్‌లోని అనంతగిరి అడవుల మాదిరిగానే భోపాల్ సరిహద్దుల్లోని రైసెన్ అడవిని ఎంచుకున్నట్లు ఏటీఎస్ అధికారులు నిర్ధారించారు. అక్కడ అరెస్టయిన 11 మందితో పాటు నగరంలో చిక్కిన ఐదుగురినీ ప్రస్తుతం ఏటీఎస్ తమ కస్టడీలోకి తీసుకుని విచారిస్తోంది. –భోపాల్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సయ్యద్ డానిష్ అలీ ఇంటిలో సూత్రధారి యాసిర్ ఖాన్ నిర్వహించిన సమావేశాలకు నగరం నుంచి సలీంతో పాటు అబ్దుల్ రెహ్మాన్, షేక్ జునైద్ కూడా హాజరయ్యారని ఏటీఎస్ చెప్తోంది. దానికి సంబంధించిన ఆధారాలు సైతం తమకు లభించినట్లు స్పష్టం చేస్తోంది. గోల్కొండలోని సలీం నివాసంలో ఎయిర్ పిస్టల్, పిల్లెట్స్, భోపాల్‌లోని యాసిర్ ఇంటి నుంచి నాటు తుపాకీ, తూటాలు సీజ్ చేశారు. ఈ నాటు తుపాకీ సేకరించింది, భోపాల్ మాడ్యుల్‌కు శిక్షణ ఇచ్చింది కూడా సలీం అని ఏటీఎస్ అనుమానిస్తోంది. ఆ కోణంలో అతడిని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది.

- ఆయుధాలు సమీకరించింది మహ్మద్ సలీం
- అక్కడి బృందానికీ ఇతడి ద్వారానే శిక్షణ
- ఈ ఐదుగురి నుంచి విదేశాలకు ఫోన్ కాల్స్


నగరంలో అరెస్టు చేసిన ఐదుగురినీ భోపాల్ కోర్టులో హాజరుపరుస్తున్న ఏటీఎస్

విదేశీ నంబర్లకు ఫోన్లపై ఆరా

నగర మాడ్యుల్‌కు చెందిన ఐదుగురు సభ్యుల ఫోన్ల నుంచి విదేశీ నెంబర్లకు ఫోన్లు వెళ్లినట్లు అనుమానిస్తున్న దర్యాప్తు అధికారులు వాటి వివరాలు ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వీరికి విదేశాల్లో ఉన్న వారితో ఉన్న సంబంధాల పైనా దర్యాప్తు చేయనున్నారు. ఉగ్రవాద సాహిత్యాన్ని తన ల్యాప్‌టాప్ వినియోగించి సొంతంగా తయారు చేసిన సలీం అందులో అనేక అంశాలు చేర్చాడు. ఆన్‌లైన్‌లో ఉన్న విషయాలతో పాటు వివిధ పుస్తకాల్లోని అంశాలు క్రోడీకరించి రూపొందించిన ఇందులో జిహాద్, ముజాహిదీన్ అంటే ఏమిటి? తాము ఏం చేయాలి? అనే వివరాలతో పాటు ఉగ్రవాద చర్యల్లో పాల్గొంటూ చనిపోయిన వారి కుటుంబాలను ఎలా ఆదుకోవాలి? ఎలాంటి ఆయుధాలు సమీకరించుకోవాలి? క్యాడర్‌ను ఎలా రిక్రూట్ చేసుకోవాలి? తదితర వివరాలు పొందుపరిచాడు.

ఈ కేసులో సాక్షులుగా 'వారు'

సలీం, రెహ్మాన్ గతంలో మరికొందరిని ఆకర్షించారు. వీళ్లు కేవలం మతపరమైన కార్యక్రమాలు చేపడుతున్నారని భావించిన వాళ్లు కొన్ని సమావేశాలకు హాజరయ్యారు. అయితే కొన్నాళ్లకే వీరి వ్యవహారశైలి, కార్యకలాపాలు అనుమానాస్పదంగా భావించిన వారంతా దూరయమ్యారు. వీరిని గుర్తించి, ఈ కేసులో సాక్షులుగా మార్చాలని పోలీసులు భావిస్తున్నారు.

ముగ్గురి ఇళ్లకు సీసీ కెమెరాలు

నగరంలోని వివిధ ప్రాంతాల్లో చిక్కిన ఐదుగురి ఉగ్రవాదుల్లో ముగ్గురి ఇళ్లకు బయట సీసీ కెమెరాలు ఉన్నాయి. మంగళవారం ఉదయం ఏటీఎస్ అధికారులు, పోలీసులు దాడి చేయడానికి వచ్చారనే విషయం వీటిలో చూసి వాళ్లు గుర్తించారు. దీంతో ఉగ్రవాద సాహిత్యం దొరక్కుండా చేయడానికి ప్రయత్నాలు చేశారు.

ఈనెల 15 నుంచి సీఎం కప్

- పురుషులు, మహిళలకు వేర్వేరుగా క్రీడలు
- మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు
- గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకేనన్న శాట్స్ చైర్మన్

గన్‌ఫౌండ్రీ: సీఎం కప్–2023 పేరిట ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో క్రీడా సంబరాలను నిర్వహించనుంది, ఈనెల 15 నుంచి 31వరకు వివిధ క్రీడా పోటీలు జరగనున్నాయి.15 ఏళ్ల నుంచి 36 ఏళ్ల వయస్సుగల పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించే క్రీడలు, వాటి నిర్వహణ, అందులో ఎవరెవరు ఉండాలనే అంశాలను రాష్ట్ర క్రీడా ప్రాదిరాన సంస్థ (శాట్స్) విడుదల చేసింది.

నిర్వహించనున్న క్రీడలు.. : ఈనెల 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో, 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. 28 నుంచి 31 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. మండల స్థాయిలో మహిళలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ పోటీలు ఉంటాయి. పురుషులకు వాలీబాల్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్, ఈత పోటీలు నిర్వహించనున్నారు. క్రీడల నిర్వహణకు మండల స్థాయికి రూ.15 వేలు, జిల్లా స్థాయికి రూ.75 ఇవ్వనున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు, ఔత్సాహికుల నుంచి నిధులను సమకూర్చుకోవచ్చు.

నగదు ప్రోత్సాహకాలు..

రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందే జట్లకు మొదటి బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75 వేలు, తృతీయ బహుమతిగా రూ.50 వేలు అందజేస్తారు. వ్యక్తిగత క్రీడల్లో బహుమతిగా ప్రథమ–రూ.20 వేలు, ద్వితీయ–రూ.15 వేలు, తృతీయ–రూ.10 వేల నగదు అందజేయనున్నారు. క్రీడా పోటీల్లో పాల్గొన్నవారికి ప్రశంసా పత్రాలనూ అందజేస్తారు. క్రీడల్లో పాల్గొనాలనుకునేవారు కలెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీల్లో పేర్లు నమోదు చేసుకోవాలి. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్ అన్నారు.

బండి కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా!

- తాళి కట్టేందుకు మొండికేసిన వరుడు
- బైక్‌కు డబ్బులిచ్చి.. పెళ్లికి ఒప్పించిన ఎమ్మెల్యే రసమయి
- కరీంనగర్ జిల్లాలో ఘటన



శంకరపట్నం(మానకొండూర్): పెళ్లికూతురు మెడలో తాళి కట్టే సమయానికి బండి కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా.. అని వరుడు మొండికేయడంతో అతిథిగా వెళ్లిన ఎమ్మెల్యే తానుబండి కొనిస్తా అని డబ్బులు ఇచ్చి వివాహంజరిపించిన ఘటన కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్‌లో చోటుచేసుకుంది. శంకరపట్నం మండలం అంబాల్‌పూర్ మాజీ సర్పంచ్ గాజుల లచ్చమ్మ, మాజీ ఉపసర్పంచ్ మల్లయ్య కూతురు అనూష వివాహం సైదాపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన సంఘాల వినయ్‌తో కుదిరింది. రూ.5 లక్షల కట్నంతో పాటు మోటార్ సైకిల్ కొనిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. కట్నం డబ్బులు ముట్టచెప్పారు. మొలంగూర్ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం పెళ్లి మండపానికి వధువు, వరుడి బంధువులు చేరుకున్నారు. కొత్తజంటను ఆశీర్వదించేందుకు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కూడా హాజరయ్యారు. తీరా.. తాళికట్టే సమయంలో మోటార్ సైకిల్ కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా.. అని వరుడు వినయ్ మొండికేశాడు. దీంతో వరుడు, వధువు బంధువులు గొడవకు దిగడంతో ఎమ్మెల్యే రసమయి జోక్యం చేసుకుని పెళ్లి కొడుకు వినయ్‌తో మాట్లాడి మోటార్ సైకిల్ కొనుక్కోమని సొంత డబ్బులను (సుమారు రూ.50వేలు) అప్పటికప్పుడే పందిట్లోనే అందించారు. మిగతా సొమ్ము కూడా తానే ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం దగ్గరుండి వివాహం జరిపించి నూతన జంటను ఆశీర్వదించారు. తోడబుట్టిన అన్నగా పెళ్లి మండపంలో పరువు కాపాడావని మాజీ సర్పంచ్ గాజుల లచ్చమ్మ కన్నీరు పెట్టుకుంది.

మైనార్టీ గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్‌గా శ్రీనివాస్



న్యూశాయంపేట : తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ స్కూల్స్ సొసైటీ (టెమ్రిస్) ఉమ్మడి వరంగల్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్‌గా కాజీపేట (బి)1, మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తనుగుల శ్రీనివాస్‌ను నియమించారు. ఈ మేరకు సెక్రెటరీ షఫియుల్లా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఆర్ఎల్‌సీగా పని చేసిన శ్రీపాల యథాస్థానమైన వరంగల్ (జి)2 స్కూల్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించనున్నారు. కాజీపేట గురుకుల ప్రిన్సిపాల్‌గా అదే గురుకుల ఉర్దూ పీజీటీ మహ్మద్ ఆబిద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆర్ఎల్‌సీగా నియమితులైన క్రమంలో శ్రీనివాస్‌ను ఉమ్మడి జిల్లాలోని ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

న్యాక్ అత్యుత్తమ గ్రేడ్ సాధించేలా సన్నద్ధం కండి

- కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీకి అత్యుత్తమ న్యాక్ ప్లస్ లేదా న్యాక్ 'ఏ' గ్రేడ్ సాధించేలా అన్ని విభాగాల అధిపతులు, ప్రిన్సిపాళ్లు, బీఓఎస్‌లు సిద్ధం కావాలని వైస్ చాన్స్‌లర్ (వీసీ) ఆచార్య తాటికొండ రమేష్ కోరారు. క్యాంపస్‌లోని సెనేట్ హాలులో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేయూలో న్యాక్ బృందం ఈనెల 25, 26, 27 తేదీల్లో పర్యటించనుందని తెలిపారు. న్యాక్ బృందం సంబంధిత విభాగాలకు వచ్చినప్పుడు వారు అడిగే ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఎలాంటి ప్రశ్నలు అడుగుతారో కూడా పలు ప్రశ్నలను రూపొందించి వాటిని సైతం విభాగాల అధిపతులకు, ప్రిన్సిపాళ్లకు, బీఓఎస్‌లకు తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తోపాటు అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు సైతం ఆయా విభాగాల్లో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఐక్యూఏసీ డైరెక్టర్ ఆచార్య నర్సింహాచారి, విశ్రాంత ఆచార్యులు కృష్ణమాచార్య, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

న్యూశాయంపేట : గురుకులాల్లో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ, తదితర పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని మైనార్టీ నిరుద్యోగ యువత పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటేందుకు రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, కెరియర్ కౌన్సిల్ సెంటర్ ద్వారా ఉచిత శిక్షణ అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం ఈనెల 25లోగా కలెక్టరేట్‌లోని కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 7330990322లో సంప్రదించాలని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో భారీగా గోదాములు

- వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

దుగ్గొండి: 60 ఏళ్ల సమైక్య పాలనలో నాటి పాలకులు 38 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములు నిర్మించగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం గడచిన తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ హయాంలో 36 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోదాములు నిర్మించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చలపర్తి గ్రామంలో రూ.8 కోట్ల వ్యయంతో నిర్మించిన 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఇటీవల పంట నష్టపోయిన రైతులకు రూ.37.50 కోట్ల విలువైన చెక్కును అందించారు. ఈ సందర్భంగా సభలో మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఐదేళ్లుగా రైతుబంధు పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణాలో అమలు అవుతున్న రైతుబంధు, రైతు బీమా పథకాలు ఐక్యరాజ్యసమితి ప్రశంసలు పొందాయని చెప్పారు. ప్రకృతి ప్రకోపానికి పంట పోతే రైతు దుఃఖం వెలకట్టలేనిదని, ప్రభుత్వం అందిస్తున్న సాయం స్వాంతన మాత్రమేనని స్పష్టం చేశారు. తడిసిన, రంగు మారిన మొక్కజొన్న పంటను ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు.


గోదామును ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే పెద్ది తదితరులు

పాలకుర్తికి రూ.30 కోట్లు..
నర్సంపేటకు రూ.70 కోట్లు..

నియోజకవర్గాల్లో తారు రోడ్ల నిర్మాణానికి సీఎం కేసీఆర్ పాలకుర్తికి రూ.30 కోట్లు ఇస్తే నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి రూ.70 కోట్లు మంజూరు చేశారని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. గిర్నిబావి నుంచి దుగ్గొండి వరకు రూ.15 కోట్ల వ్యయంతో తలపెట్టిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఛత్తీస్‌గఢ్ పాలన రావాలని మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి అక్కడ ఎకరాకు 7 క్వింటాళ్ల ధాన్యమే కొంటారని, 7 గంటలే కరెంట్ ఇస్తారని, రైతుబంధు రూ.2 వేలే ఇస్తారని తెలియనట్టుందని ఎద్దేవా చేశారు. నర్సంపేట ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ వడగండ్ల వానకు పంట నష్టపోయిన రైతుల కన్నీటిని సీఎం కేసీఆర్ తుడిచారని చెప్పారు. నష్టపోయిన రైతులకు వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా సబ్సిడీపై టార్పాలిన్ షీట్లు, పీవీసీ పైపులు అందించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్, కలెక్టర్ ప్రావీణ్య, జాయింట్ కలెక్టర్లు శ్రీవత్స, అశ్విని తానాజి, డీఏఓ ఉషాదయాల్, డీఎం జితేందర్, ఉద్యానవన అధికారి శ్రీనివాస్, డీఆర్ ఈఓ సంపత్‌రావు, ఆర్డీఓ శ్రీనివాస్, జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, ఎంపీపీ కోమల, సింగిల్ విండో చైర్మన్ రాజేశ్వర్‌రావు, సర్పంచ్ ముదరకోల శారద, ఎంపీటీసీ సోని తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్పత్రి భవన పనుల పరిశీలన

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ఆస్పత్రి సమీపంలో నిర్మితమౌతున్న నూతన 20 పడకల ఆస్పత్రి భవన పనులను దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ (పీసీఎండీ) డాక్టర్ వెంకటేశ్వర్లు, సికింద్రాబాద్ డివిజన్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మలా రాజన్ శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఆస్పత్రి పనులపై స్థానిక అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం రైల్వే ఆస్పత్రిని పీసీఎండీ వెంకటేశ్వర్లు, సీఎంఎస్ డాక్టర్ నిర్మలా రాజన్ సందర్శించి తనిఖీ చేశారు. ఆస్పతి అభివృద్ధిపై స్థానిక రైల్వే ఆస్పత్రి డీఎంఓ డాక్టర్ ఐ.నిరంజన్‌రావును అడిగి తెలుసుకున్నారు.

పీసీఎండీకి ఎస్సీ ఎస్టీ నాయకుల సన్మానం

కాజీపేట రైల్వే ఆస్పత్రికి వచ్చిన సందర్భంగా రైల్వే పీసీఎండీ డాక్టర్ వెంకటేశ్వర్లు, సీఎంఎస్ డాక్టర్ నిర్మలా రాజన్‌లను రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ బి.వీరన్న, మెడికల్ సీ అండ్‌డబ్ల్యూ, ఎలక్ట్రికల్ బ్రాంచ్ సెక్రెటరీ చింత తిరుపతి, లోకో రన్నింగ్ బ్రాంచ్ ప్రెసిడెంట్ ఎంఎల్.నారాయణ, మురళి కలిసి పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రైల్వే డాక్టర్లు నిరంజన్‌రావు, నరేందర్, ధీరజ్‌కుమార్, హరిబాబు, చీఫ్ ఫార్మసిస్టులు హరీష్, సులోచన, మురళి, మానస, భిక్షపతి, ప్రసాద్, సంతోష్, రజియా, జమున, సోని, తదితరులు పాల్గొన్నారు.

పీసీఎండీకి వినతి

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైల్వే పీసీఎండి డాక్టర్ వెంకటేశ్వర్లు, సీఎంఎస్ డాక్టర్ నిర్మలా రాజన్‌లకు రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.సంగమయ్య, సెక్రెటరీ వి.రావు, ఎండీ.జహంగీర్, జి.మాణిక్యం వినతిపత్రం అందజేశారు. తొలుత వెంకటేశ్వర్లు, నిర్మలా రాజన్‌లను వారు సన్మానించారు.


పీసీఎండీ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న నాయకులు

రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో పీసీఈఈ తనిఖీ

కాజీపేటలోని రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌ను దక్షిణ మధ్య రైల్వే ప్రిన్స్‌పాల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (పీసీఈఈ) పీడీ.మిశ్రా శుక్రవారం తనిఖీ చేశారు. షెడ్‌లోని వివిధ విభాగాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం షెడ్ అభివృద్ధి, కార్మికుల సమస్యలపై షెడ్ సీనియర్ డీఈఈ ప్రశాంత సాయి కృష్ణను అడిగి తెలుసుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

షెడ్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైల్వే మజ్దూర్ యూనియన్ ఎలక్ట్రిక్ లోకో షెడ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో పీసీఈఈ మిశ్రాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ బ్రాంచ్ సెక్రెటరీ నాయిని సదానందం మాట్లాడారు. కార్మికుల సమస్యలను పీసీఈఈ దృష్టికి తీసుకెళ్లారు.

ప్రొఫెసర్‌కు ప్రిన్సిపాల్‌గా రెండేళ్లు పదవి.. ఎలా..?

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, విభాగాధిపతిగా ప్రొఫెసర్ జి.రాజిరెడ్డిని నియమిస్తూ ఎలా ఉత్తర్వులు జారీ చేశారనే విషయం చర్చనీయాంశంగా మారింది. ఆయన్ను ఆ పదవిలో రెండేళ్లపాటు కొనసాగేలా ఈనెల 10న రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆయన గురువారం బాధ్యతలను స్వీకరించారు. కాగా ప్రొఫెసర్ రాజిరెడ్డి ఈ ఏడాది డిసెంబర్ 31న ఉద్యోగ విరమణ పొందనుండగా రెండేళ్ల కాలానికి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగ విరమణ పొందాక కొనసాగాలంటే మళ్లీ ఆయన్ను అడ్జెంట్ ప్రొఫెసర్‌గానైనా విధుల్లోకి తీసుకునే ఉత్తర్వులు ఇచ్చాకే మళ్లీ ప్రిన్సిపాల్‌గా నియమించాల్సి ఉంటుంది. కాగా ఆ కళాశాలలో రెగ్యులర్ ఆచార్యులు ఉన్నారు. ఆ పరిస్థితుల్లో ఆయన్ను అడ్జెంట్ ఆచార్యులుగా తీసుకునే అవకాశం లేదు. అయినా ప్రిన్సిపాల్, విభాగాధిపతిగా నియమిస్తూ ఉత్తర్వులు ఇవ్వడంలోని ఆంతర్యం ఏంటనే చర్చ సాగుతోంది. వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అనుమతి మేరకే రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస్‌రావు నియమించారని తెలిసింది. ఉత్తర్వులు ఇవ్వటంలో ఏమైనా పొరపాటు జరిగిందా అనేది తేలాల్సి ఉంది.

రాష్ట్రస్థాయిలో 'పింగిళి' విద్యార్థుల ప్రతిభ

విద్యారణ్యపురి : రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రభుత్వ పింగిళి డిగ్రీ కళాశాల తెలుగు, జువాలజీ సబ్జెక్టుల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి విలేకరులకు వివరాలు శుక్రవారం వెల్లడించారు. ఈనెల 3 నుంచి 5 వరకు హైదరాబాద్‌లో పోటీలు నిర్వహించగా తెలుగు ప్రాజెక్టుకు సంబంధించి 'స్త్రీలు–కథా సాహిత్య ధోరణులు' అంశంపై కళాశాల విద్యార్థి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ మురాడి శ్యామల సభ్యురాలిగా వ్యవహరించారని చెప్పారు. బీఎస్సీ ఫిజికల్ సైన్స్ సెకండియర్ విద్యార్థులు పూజిత, ప్రమీల, అశ్విత పాటిల్, పి.కీర్తి, ఎస్.మనీషా, ఎస్.నికిత తెలుగు ప్రాజెక్టును రూపొందించి ప్రజెంటేషన్ ఇచ్చారని తెలిపారు. అలాగే జువాలజీ విభాగాధిపతి జి.సుహాసిని మెంటార్‌గా వ్యవహరించగా ×పట్టు ఉత్పత్తులు–పెంపుదలకు పాలిమైన్ల ప్రభావం× అంశంతో బీఎస్సీ బీజెడ్సీ విద్యార్థులు దివ్యశ్రీ, ఎస్.విష్ణుప్రియ, శ్రావణి, భవ్యశ్రీ, ప్రసన్న, ప్రాజెక్టు రూపొందించి ప్రదర్శించి ప్రతిభ చాటారని వివరించారు. ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను ఆయనతోపాటు కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజిరెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.పార్వతి, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ డి.రామకృష్ణారెడ్డి అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాళ్లు చంద్రమౌళి, రాజిరెడ్డి

ఆర్వోబీ పనులు తక్షణమే పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

కమలాపూర్: హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు తక్షణమే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఆరేళ్ల క్రితం పూర్తి కావాల్సిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు అతీగతి లేకుండా పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బండ శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శుక్రవారం ఆయన బ్రిడ్జి పెండింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను ఎందుకు పట్టించుకోవడం లేదని, దీనిపై ఎందుకు శ్రద్ధ పెట్టడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతగా రైల్వే స్టేషన్‌కు ఇరువైపులా ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి చాలా కాలం అయ్యిందని, కానీ కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతగా నిర్మించాల్సిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.


ఉప్పల్ ఆర్వోబీ పెండింగ్ పనులను పరిశీలిస్తున్న వినోద్‌కుమార్

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

సాక్షి, మహబూబాబాద్: అన్ని రాష్ట్రాల కంటే వెనుక ఏర్పడిన తెలంగాణలో వైద్యం పేదలకు అందుబాటులోకి వచ్చిందని, ఇందుకోసం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. నైటింగేల్ జన్మదినోత్సవం పురస్కరించుకొని మహబూబాబాద్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా నర్సింగ్ విద్యార్థులతో కేక్‌కట్ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడారు. గతంలో 'నేను రాను బిడ్డా సర్కారు దవాఖానాకు' అనే మాట ఉండేదని, తండా వాసులు సర్కారు దవాఖానాకు వైద్యం అందదని భయపడేవారని అన్నారు. కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చొరవతో అనేక మార్పులు వచ్చాయని అన్నారు. ప్రతి జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. వేల కోట్ల రూపాయలు వెచ్చించి అన్ని ఆస్పత్రుల్లో కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ వనరులను రాష్ట్ర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, డాక్టర్, నర్సింగ్ విద్యలో చేరి సామాజిక సేవలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ శశాంక పాల్గొన్నారు.


నర్సింగ్ విద్యార్థినులకు స్వీట్లు తినిపిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, కలెక్టర్ శశాంక